నేను ఓడిపోయాను

మాధవరావుకు వాళ్ళ క్లాసులోవున్న అమ్మాయి లంతా కలిసి మంచిపేరు ఒకటి బహుమానంగా యిచ్చారు— ''పుస్తకాల పురుగు'' అని!

మాధవరావు కొంచెం భిడియస్తుడు. కాలేజీలో అడుగుపెట్టిన కొత్తల్లో మరీ! మొగవాళ్ళతో మాట్లాడాలంటేనే తలవంచుకొని మాట్లాడేవాడు. దానికి తోడు సర్వకాల సర్వావస్థలలోను చేతిలో తెరిచిన పుస్తకం వుండేది. అందుకనే ఎప్పుడూ దాదాపు ఫస్టు మార్కులు వస్తుండేవి! ప్చ్... కాని పాపం ఏంలాభం?... పూర్తిగా అమ్మాయిల చేతుల్లో అలుసైపోయాడు!

రాధిక చురుకైన పిల్ల. ప్రతి వాళ్ళతోటి చాలా సోషల్‌గామూవ్ అవుతుంది. పెద్ద పెద్ద ధైర్యం వున్న కుర్రవాళ్ళే ఆమె జోలికిపోరు—మళ్ళా మాట్లాడితే ఆమె పోలికలన్నీ ''అగ్గిభరాటా!''కు సమానం. ప్రతివాళ్లను కవ్వించి ఏడిపించే రకం!

అటువంటి దాని కళ్ళలోనే నలుసులాగా పడ్డాడు మాధవరావు! పడివున్నా బాగానే వుండేది... ఉండి ఉండి నలిపేస్తోంది!

గంట కొట్టేటప్పటికి క్లాస్‌రూంలోకి విద్యార్థులంతా బిలబిలా చేరారు. ఆ గంటలో ఎకనామిక్స్ లెక్చరర్ అవధానం చేస్తారు!

ఈ రోజుల్లో క్లాసుల కెళ్ళటం అంటేనే లెక్చరర్లకు భయం...అందులో కొత్తగా ఆ ఉద్యోగాన్ని స్వీకరించిన వారికి మరీ భయం...ముఖ్యంగా కో ఎడ్యుకేషన్ ఉన్న కాలేజీలయితే సరేసరి!

లెక్చరర్‌గారు వచ్చి తలెత్తకుండానే పావుగంట చెప్పాడు పాఠం గడ గడా. చెప్పి తలెత్తి కళ్లు గిర గిరా తిప్పిచూసి 'ఎవరైనా...' అంటూ ఒక ప్రశ్నను రాకెట్ లాగా వదిలాడు. అది ఆ గదిలోనే చుట్టూ తిరిగి ఆయన దగ్గరికే వచ్చి చేరింది. దాని ప్రభావాన్ని మాత్రం రేడియో రికార్డు చేయకుండా స్తబ్ధుగా వుండిపోయింది.

ఒక నిముషం—నిశ్శబ్దం.
రెండు నిముషాలు—నిశ్శబ్దం
రెండున్నర నిముషాలు—నిశ్శబ్దం

ఇక ఉండలేక "మిస్టర్ మాధవరావ్...ప్లీజ్ ట్రై!" అన్నాడు.

మాధవరావు భిడియం భిడియంగా లేచి నిలబడి టై సర్దుకొని లెక్చరర్ ముఖంలోకే చూస్తూ నోరు తెరిచి ఏదో చెప్పబోయాడు.

రాధిక ఛటుక్కున తుమ్మింది!

క్లాసంతా గొల్లుమన్నారు.

లెక్చరర్‌గారు గుడ్లురిమి, ఎందుకులే కళ్లు నెప్పులు పుడతయ్యని మానుకున్నాడు.

మాధవరావు చేసేదేఁవీలేక తలతీసినంత బాధపడి, ఆ బాధతోనే మూలుగు మూలిగినట్లుగా నిట్టూర్పు విడిచి చతికిలబడ్డాడు.

ప్రక్కనేవున్న ముకుందరావు మాధవరావు చెవి దగ్గరికల్లా నోరు జేరేసి "గాలి తీసిందిరా!" అన్నాడు.

మాధవరావు చప్పగా గాలిపోయినట్లుగానే ఊరుకున్నాడు.

కాలేజీ అయిపోయిన తరువాత జరిగిన పరాభవానికి లోలోనే కోపం తెచ్చుకొని, చేసేదేఁవీలేక రిక్షా ఎక్కి రూంకెళ్లాడు.

కిటికీలోనుండి పడ్డ ఉత్తరం నేలమీద దొర్లుతోంది. చేతిలోకి తీసుకొని చూచాడు. అన్నయ్య వ్రాశాడు రెండే ముక్కలు.

"తమ్ముడూ!

అమ్మా నాన్నా లేని లోటులేకుండా అన్నీ నేనే అయి నిన్ను పెంచాను. యుక్తవయస్సు వచ్చింది గాబట్టి నీ వివాహం చేయాలనుకుంటున్నాం. సంబంధాలు చూస్తున్నాం. నీకేం అభ్యంతరం లేదనుకుంటూ.

ఇట్లు, నీ అన్నయ్య
సీతాపతి"

"ఈ ఆడవాళ్లు—" అని పళ్లు కరకరా కొరుక్కొని తలపట్టుకొని మంచంమీద కూలబడ్డాడు కాలేజీ గుడ్డలయినా విప్పకుండా మాధవరావు!

* * *

రాధికమీద మాధవరావుకు రోజు రోజుకు కోపం అసలుమీద వడ్డీలాగా పెరుగుతోంది. మొత్తం కలిసి ఏలా తీర్చుకోవాలా అని కొన్నాళ్ళు అతి యిష్టమైన చదువుగూడా మానేసి ఆలోచించాడు. ఆలోచనలు రాకపోగా అవమానం మాత్రం పెరుగుతునే వున్నది!

అటువంటి సమయంలో కాలేజీ ఎలక్షన్లు వచ్చినయి. మిత్ర బృందమంతా కలిసి "అబ్బాయి! నీకు యింగ్లీషులో డబ్బై ఆరుమార్కులు వచ్చినయి కాబట్టి నీవూ పోటీ చేయాలి...చేయనన్నావో తంతాం!" అన్నారు.

"నాకెందుకురా!" అని నసిగాడు.

వాళ్ళు నిజంగానే తన్నబోయేటప్పటికి 'సిపాయి' లాగా నడిచివెళ్ళి 'నామినేషన్' పారేసి వచ్చాడు ఆఫీసులో.

ఎలక్షన్లు ఇంకా వారం రోజులున్నాయి అనగా పాంప్లెట్సు కొట్టించారు. దీనితోబాటు టైంటేబుల్ కార్డ్సు కూడా క్లాసువారీగా అచ్చువేయించి, ప్రతి వాడి పేరు వ్రాసి సాధ్యమయినంతవరకు వాళ్ళింటికి స్వయంగా వెళ్ళి, "మై డియర్ రామారావ్! నేను రేపు రాబోయే ఎలక్ష

న్ లలో నిలబడుతున్నాను. గెలిపిస్తే నేనన్నో సహాయాలు మీకు చేస్తాను. మీ సహాయముంటే మరీ చేస్తాను. దానికి నిదర్శనంగానే మీకెంతో సహాయకారికాగల ఈ టైం టేబుల్ కార్డ్సు కొట్టించి ఊరికే పంచిపెడుతున్నాను. కనుక మీరు మీ వోటువేసి, మీ మిత్రులచేత వేయించి నన్ను గెలిపించాల్సింది!" అని అన్ని భావాలు ముఖంమీద తిప్పుతూ చెప్పుకొని మరీ వచ్చాడు.

వెంటవెళ్ళిన ముకుందరావు మాధవరావు టైం టేబుల్ కార్డ్సు యిస్తున్నప్పుడు అవతలవాడు ఏడుపు మొఖంతో తీసుకున్నాడా, నవ్వు మొఖంతో తీసుకున్నాడా అని పరిశీలిస్తూ అలాంటివి రెండు జాబితాలు తయారు చేశాడు. నవ్వుతూ తీసుకుంటే వోటు మాధవరావుకే వేస్తాడు. ఏడుస్తూ తీసుకున్నాడో ప్రత్యర్థి 'ఓంకారం'గాడికేస్తాడన్నమాట!

ఇక రేపే ఎలక్షన్ లనంగా ఆరోజు రాత్రి తొమ్మిది గంటలకు మిత్ర బృందమంతా మాధవరావు రూములో జేరారు.

"జాబితాలనుబట్టి చూస్తే మనకే రెండు వందల ఓట్లు ఎక్కువ వున్నాయి. దాదాపు మన కాలేజీలో మాట యాభై మంది ఆడపిల్లలు వున్నారు. వాళ్ళు మనకు వేశారంటే మనదే గెలుపు ఖాయం!" అన్నాడు ముకుందం.

"వేయకపోతే యేంరా. యాభై యింకా మనకే ఎక్కువ వున్నాయిగా!"

"ఆ తేడావలన లాభం లేదురా...నవ్వేన వాళ్ళల్లో ఎంతమందిది నిజం నవ్వో చెప్పలేంగా...అందుకని ఆయా భై కొట్టెయ్యాల్సిందే!"

"అయితే ఎలా...ఇప్పుడేం చేద్దాం?" అన్నారు అంతా.

ఆలోచించగా రెండు ఫ్లాస్కుల టీ ఖర్చు వ్రాసిం తరువాత ఐడియా తట్టింది. వాళ్ళకు అది చిన్నది, చాలా తేలికదే అయినా మాధవరావు మాత్రం కొండను మోయాల్సినంతగా భయపడ్డాడు. ఏడవటమే గాకుండా గజగజా వణికాడు.

"అంటే నేను రాధికను వెళ్ళి 'మీదే గాకుండా మీ ఆడవాళ్ళ వోట్లన్నీ కూడా నాకే వేయించా'లని అడగాలా?..." అన్నాడు చిట్టచివరకు గుడ్లు తేలేస్తూ.

శ్రీనివాసులు విలన్‌లా మొఖంపెట్టి కిటికీ దగ్గరికెళ్ళి ఎటో చూస్తూ, సిగిరెట్లు పీలుస్తూ, "అవును మిస్టర్ మాధవ రావ్! నీవు వెళ్ళక తప్పదు. ఇది జీవన్మరణసమస్య— నీవు వోడిపోయినావో మన పరువు ప్రతిష్ఠలు అన్నీ గంగలో కలిసి చివరికి ఉప్పు సముద్రంలో పడిపోతయి. అప్పుడు నీ మొఖం ఎవరికీ చూపలేవు. ముఖ్యంగా రాధిక ముందు నీవిక ఎందుకు పలికిరాని ఒక 'పిచ్చుక'వై పోతావు. ఆ దిగాలుపడి నల్లబడిన మొఖంతో తిరిగి కాలేజీలో అడుగు పెట్టటంకంటే ఏ మెరీనాబీచ్‌కో వెళ్ళి మాయమవ్వటం

మంచిదనుకుంటూ! ఆలోచించుకో — అయినా ఒక అమ్మాయితో మాట్లాడటానికే అంత అబలుడువై పోతావేం... నిజంగా ఎవరి శక్తి సామర్థ్యాలు వారికి తెలియవు... కొత్తగాబట్టి అలా గనుకుంటున్నావు గాని రాధికతో మాట్లాడి వచ్చిం తరువాత ప్రతి అమ్మాయి దగ్గరికి కూడా స్వయంగా వెళ్ళి చెప్పాలనిపిస్తుంది—చూడు!'' అని ఒక్క-క్షణం నిశ్శబ్దంగా ఊరుకొని, ''రెండు చాక్లెట్లు తెప్పించు. గొంతు తడారిపోతోంది!'' అంటూ చాపమీద చిటికిల పడ్డాడు.

స్నేహితుల ప్రోద్బలంతో నైతేనేం, వోడిపోతాననే అధైర్యంతో నైతేనేం రాధిక దగ్గరికి వెళ్ళాడు ఆమె వెయిటింగ్ హాల్లో ఒంటరిగా కూర్చొని వుండటం చూచి.

అతడిని చూస్తూనే ఆమె నవ్వింది. దిగజారి పోకుండా చిన్నగా తనూ నవ్వాడు.

''ఏమిటిలా వచ్చారు?'' అన్నది.

''మీతో కొంచెం పనుంది!'' అని కాళ్లూ చేతులు చూసుకొని వణకక పోవటంతో ఆశ్చర్యపోయి నోట్లో వేలేసుకోబోయి ఎదురుగ్గా వున్న రాధికను చూచి నోరు మూసుకొన్నాడు.

''మీరంతా ఎలక్షన్‌లలో నేను గెలవటానికి సహాయం చేయాలి?'' అన్నాడు అప్పచెప్పినట్లుగా.

''తప్పకుండా!'' అంది.

"థాంక్స్...వస్తా!" అని మళ్ళీ వెనుదిరిగి చూడకుండా స్నేహితుల మధ్య వచ్చి పడ్డాడు. "అరే! ఏవిటి ...రాధిక ఎంత మంచిది?" అనుకుంటూ.

ఎలక్షన్లు ఏలాంటి కొట్లాటలు లేకుండా ప్రశాంతంగానే గడిచిపోయినయి. సాయంత్రం ఐదు గంటలకు కౌంటింగ్ మొదలు పెట్టారు.

అందులో అన్యాయం జరక్కుండా ఉండేందుకుగాను ఆడవాళ్ళ తరఫున రాధికను, మొగవాళ్ళ వైపు ఒక 'రావు'ను కూడా లోపలికొచ్చి కూర్చోమన్నారు.

రాత్రి ఎనిమిదయినా ఇంకా లెక్కెస్తూనే వున్నారు. ఓంకారం ఒక మూల, మాధవరావు మరొక మూల వరండాల్లో దిగాలుబడి నిల్చొని వున్నారు, అప్పుడప్పుడు వాళ్ళ మిత్రబృందం 'ఊహాలెక్కలు' జేరవేస్తుంటే తేలిపోతూ వాలిపోతూ.

అటువంటి సమయంలో రాధిక హడావిడిగా మాధవరావు దగ్గరికొచ్చి చిన్నగా, జాలిగా చెప్పింది. "మాధవరావుగారూ! మీరు పది ఓట్ల తేడాతో ఓడిపోయారని చెప్పటానికి విచారంగా వుంది!" అని గిరుక్కున తిరిగి వెనక్కు వెళ్ళిపోయింది.

ఆపుకోలేని ఏడుపుతో రిక్షా ఎక్కి రూంకెళ్ళి బెడ్ మీద పడి నిజంగానే ఏడ్చేశాడు. ఖర్చుపెట్టిన డబ్బంతా వృథా, దానికితోడు వోడిపోయినందుకు నామర్దా...రాధిక ముందు తను ఇక తలెత్తుకొని తిరగలేడు!

కళ్ళు తిరిగిపోయేలా దొర్లాడు. జుట్టు ఊడిపోయేలా పీక్కొని కంట్లో చివరిబొట్టు వరకు నీరు కార్చేశాడు.

వెంటనే శ్రీనివాసులు మాటలు గుర్తుకొచ్చి మెరీనా బీచ్ కన్నా వెళ్ళి వాడన్న పని చేద్దామని వంటిన వున్న ఖరీదైన గుడ్డలు విప్పేసి మాసిన చిరిగినవి కట్టుకొని విసురుగా తలుపు తీసుకొని బయటపడ్డాడు.

"హల్లోవ్! కంగ్రాచులేషన్స్!" వర్షం కురిపించసాగారు, మిత్రులు చుట్టూ చేరి మాధవరావును నలిపేస్తూ, ఫళ్లు తెలియని అరుపులతో.

పక్కింటి పిన్నిగారి మొగుడు నిద్ర చెడిందని వార్నింగ్ యివ్వటంతో మాధవరావును లోపలికి మోసుకొచ్చి తలుపులు మూశారు.

మాధవరావు దిగజారిపోయి భయం భయంగా "ఏవిటిరా?" అన్నాడు.

"తన్నండిరా వెధవని పట్టుకొని...ఏడుపు ముఖం. ఎప్పుడూ ఏడుపు మొఖ మేసుకొని! రెండు వందల తొంభై తొమ్మిది వోట్ల మెజారిటీతో గెలిచినా ఆ మొఖంలో కాంతి లేకపోయె!" కొట్టేవాడిలాగా మీద మీదకి వస్తూ అరిచాడు శ్రీనివాసులు.

రబ్బరు బెలూన్‌లా సంతోషంతో ఉబికి పగలబోయే సమయానికి గట్టిగా ముకుందాన్ని వాటేసుకొని "వాట్?" అన్నాడు మాధవరావు.

తరువాత రెండు మూడు గంటల తరువాత తేరుకొని ముకుందరావుని చాటుగా తీసుకెళ్ళి జరిగింది చెప్పాడు.

"అబ్బ! గాలి తీసిందిరా!" అన్నాడు వింతగా ముకుందరావు.

మాధవరావుకు కోపం వచ్చేటప్పటికి లోపల నిద్ర పోతున్న పౌరుషం లేచి కూర్చొని ఆవులించి, వీపు చరిచి "పద! మై డియర్ మాధవరావ్! నేనున్నాను!" అంది.

మర్నాడు పన్నెండు గంటలు ఆలోచించి రాధికను ఏడిపించేందుకు ఆలోచనలు రాకపోగా తలనొప్పి మిగుల్చుకొని సాయంత్రం ఎలక్షన్ల తరువాత జరగబోయే మొదటి మీటింగ్‌కు అటెండ్ అయ్యేందుకు మిత్రబృందమంతా కాలేజీకి వెళ్ళారు.

ప్రిన్సిపాల్‌గారు పిలిచి "ఎజెండా తయారుచేయ వోయ్ మాధవరావ్!" అన్నారు.

ఖాళీ గదిలోకి వెళ్ళి కూర్చొని తెల్లకాగితం తీసుకొని ప్రోగ్రామ్స్ వ్రాయటం మొదలుపెట్టారు మిత్రులంతా.

"మొట్టమొదట ప్రేయర్" అన్నాడు ముకుందం.

"వెంకట్రావును పాడమందామా ?" తలెత్తి అడిగాడు మాధవరావు. వెంకట్రావు సినిమాల్లో ఛాన్సు కోసరం ప్రయత్నిస్తున్న సంగీతం పిచ్చిగాడు!

శ్రీనివాసులు లేచి నిలబడి ముందుకువస్తూ "రాధికయితే ఎలా ఉంటుంది?" అన్నాడు.

ఆమాట వినటం ఆలస్యం అంతా రాధికే పాడా లన్నారు.

"ఆమెకు పాటలు వచ్చునో రావో?"

శ్రీనివాసులు నవ్వాడు. "అంత అందమైన అమ్మా యికి పాటలు రావంటే నేను ఒప్పుకోను!"

తిరిగి దానికీ మాధవరావే వెళ్ళాలన్నారు.

ఆకాశం గర్జించినట్లయింది. "చచ్చాన్రా దేవుడా!" అనుకొని తప్పక, తప్పుకోలేక చిన్నగా వరండాల్లో నిలబడి వున్న ఆడవాళ్ళ గుంపులవైపుకు నడిచాడు.

పొడుగ్గావున్న రాధిక యిట్టే కనబడింది. ఆమె మొఖంలోనికళ కొట్టొచ్చినట్లుగా ముందుకు దూకింది. ఆమె చిరునవ్వు వాడిగావచ్చి సూటిగా గుండెల్లో దిగిపోయింది. బాధగా కోటును చాటు చేసుకున్న గుండెను తడుము కున్నాడు.

"రాధికాదేవి! ఒక్కసారి యిలా వస్తారా!"

అమ్మాయిలంతా నిశ్శబ్దాన్ని ప్రేమించి, లాలించి జోకొట్టసాగారు.

"మీటింగ్‌లో ప్రేయర్‌కు మీ పేరు ఇస్తాం!" అన్నాడు కొంచెం చనువు తీసుకున్నట్లుగా లోపల భయ పడుతూనే.

ఆమె ఒక్కక్షణం కలవరపడి "అబ్బెబ్బే లేదండి... నాకు పాటలు రావు...నాలోని లోపమదే...కావాలంటే

ఒక గంట దేనిమీదైనా 'స్పీచ్' యివ్వమన్నా యిస్తాను గాని ఒక్క చరణం కూడా పాడలేను'' అంది.

''అయితే—?'' అన్నాడు. ఆమె ఏమన్నా అనుకుంటుందేమోనని విచారంగా మొఖం పెడుతూ.

''అయితే ఏంవుంది—సుగుణ పాడుతుంది. ఆమె పేరు వ్రాయండి!'' అంటూ ''సుగుణ!'' అని పిలుస్తూ, తన స్నేహితురాళ్ళలో కలిసిపోయింది.

సుగుణ పాటతో సభ ప్రారంభమయింది. అధ్యక్షులైన ప్రిన్సిపాల్‌గారే ఒక గంట 'హస్క్' కొట్టారు.

తరువాత మాధవరావు ఇంటిదగ్గర తయారయిన పాఠాన్ని అచ్చు తప్పుల్లేకుండా, అప్పచెబుతున్నట్లు గాకుండా చెప్పి, ''మీరు నన్ను గెలిపించి ఆదరం చూపినందుకు మీ అందరికి నా కృతజ్ఞతాభివందనములు!'' అంటూ కరతాళ ధ్వనులమధ్య స్టేజీ దిగసాగాడు.

అలా మెట్లు దిగుతుండగా ముందు వరుసలో కూర్చొనివున్న రాధికమీద అప్రయత్నంగా దృష్టి పడింది. అనుకోకుండా ఆమె అందానికి అంజలులు అర్పించాలనుకున్నాడు. ఆముగ్ధ మోహనాకారం అతణ్ణి వివశుణ్ణి చేసింది. తిరిగి మరుక్షణంలో అతడిలోని పౌరుషం ఒక్క తన్ను తన్ని ''నిన్ను ఏడిపించిన రాధిక నేనా ఇంతయిదిగా పొగుడుకుంటున్నావు!'' అన్నది. ఆ మాటలు వినటంతోనే రోష మొచ్చింది. ముక్కుపుటాలు ఎగర వేశాడు.

ఆ సమయంలో ఆ అందమైన మొఖంలో దాగివున్న ఠీవి, గర్వం, టెక్కు బయల్పడి మాధవరావును పురి కొల్పాయి.

విసురుగా వెళ్ళి కుర్చీలో కూర్చున్నాడు.

ఎవరికి తోచిన విధంగా వాళ్ళు స్టేజీ ఎక్కి వరుసగా చెప్పుకుపోతున్నారు.

ఉన్నట్లుండి మాధవరావుకు ఒక ఆలోచన తట్టింది. పక్కనేవున్న ముకుందాన్ని తట్టి బయటకు నడిచి, రాధికను ఏడిపించటానికి తనకు తట్టిన ఐడియాను చెవిలో చెప్పాడు.

"ఈ దెబ్బతో మాధవరావు అంటే ఏవిటో తెలిసి వస్తుంది!" అన్నాడు పెద్దగా.

ముకుందం వీపు చరిచి! "భేష్" అన్నాడు.

ఉపన్యాసకులు ఇక లేరు అనుకున్న తరువాత ప్రిన్సిపాల్ గారు ముగింపు మాటలకోసం లేవబోతున్న సమయంలో మాధవరావు ఒక్క ఉదుటున స్టేజీమీదకు దూకాడు.

అధ్యక్షులవారు మెదలకుండా కూర్చున్నారు.

"క్షమించాలి! ఒక్కమాట," అని రాధిక మొఖం లోకి చూచి తిరిగి తలెత్తి "రత్నమంటే విలువ వున్నది. కాని అది బాహ్యప్రపంచంలో వున్నప్పుడే దాని మెరుపులు చూచి మెచ్చుకుంటారు జనం. అలా కాకుండా ఇంట్లో ఏ చెక్కపెట్టెలోనో బెట్టి వుంచారే అనుకోండి—అది ఎవరికీ

తెలియదు. దాని విలువ గ్రహించలేరు. దానిని నలుగురి మధ్యకు లాగవలసిన బాధ్యత చుట్టూవున్న మనుష్యుల మీద ఆధారపడివుంటుంది.''

జనం అంతా అతడు చెప్పేదేమిటో అర్థంగాక శ్వాస బిగపట్టుకొని వింటున్నారు.

''ఇంతకీ ఎందుకు చెబుతున్నానంటే మన కాలేజీలో అమోఘంగా పాడగల లేడీ స్టూడెంట్స్ ఎందరో వున్నారు. కాని వారు అంత చక్కగా పాడగలరని చాలా కొద్దిమందికి తెలిసివుండవచ్చు!''

ఆడవాళ్ళలో గుసగుసలు కలవరం బయల్దేరింది.

''రాధికనే తీసుకోండి...ఆమెతో లతా మంగేష్కర్ గూడా పోటీకి రాలేదు!'' ఆ మాట అంటున్నప్పుడు రాధిక మొఖంలోకి చూచాడు—పూర్తిగా నల్లగా మాడి పోయివున్నది! ఆమె భీకరంగా కొట్టొచ్చేటట్లుగా తనవంకే చూస్తోంది!

మాధవరావు కలవరాన్ని కప్పిపుచ్చుకుంటూ, ''ఆమె మాధుర్యపు కంఠంతో మనల్ని ఆనందాబ్ధిలో తన్మయుల్ని గావించబోతోంది!''

కరతాళధ్వనులు ఆ హాలు టాపును లేపుతున్నాయి. ఎటూ చూడకుండా తలవంచుకొని తన సీట్లో మెదలకుండా కూర్చున్నాడు.

రాధిక విసవిసా స్టేజీమీదకు నడిచి, ''మాధవరావు

గారు పొరబాటు పడ్డారని చెప్పటానికి చింతిస్తున్నాను. క్షమించాలి. నాకు పాడటంరాదు. నమస్తే!'' అని క్రిందకు దిగబోయింది.

స్టూడెంట్స్ అంతా విజిళ్ళువేసి, చప్పట్లు గొడుతూ, ''మీరు పాడవల్సిందే!'' అని గోల చేయసాగారు.

ప్రిన్సిపాల్ గారి సౌంజ్ఞలకు విలువ లేకపోయింది,

రాధిక కోపం తార స్థాయినందుకుంది. ఎట్లాగైనా మాధవరావుకు బుద్ధి చెప్పాలనుకుంది. మాధవరావు గుండెల్లో రైళ్ళు పరుగెడుతున్నాయి ముందు ఏం జరుగుతుందోనని.

రాధిక తిరిగి మైకుముందుకొచ్చి నిలబడింది. ''ఇంత మందిని నిరుత్సాహపరచటం. నా కిష్టంలేదు గనుక ఒక పాట పాడటానికి ప్రయత్నిస్తాను?'' అంటూనే పాట మొదలు పెట్టింది.

ఆ గొంతులోని తియ్యదనం ఏ ఒక్కరితోను పోల్చలేనంత అద్భుతంగా వున్నది.

హాల్లో వారంతా పాట పూర్తయ్యే టప్పటికి ఆనందంతో 'ఒన్స్‌మోర్' అంటూ చప్పట్లు కొడుతూ వున్నారు.

మాధవరావు కళ్లు తిరిగినయి. తను వేసిన అయిడియా అంతా బూడిదైంది.

పక్కనవున్న ముకుందం చప్పరిస్తూ ''మళ్లా గాలి తీసిందిరా!'' అన్నాడు.

"గాలి గాలి అని గోల చేశావంటే గోభ్యాడగొడతా గాడిదా!" అని విసుక్కున్నాడు.

మాధవరావు మొఖంలో నెత్తురుచుక్క లేకుండా అయిపోయింది. అదే సమయంలో రాధిక అతడి ముందు తలెత్తుకొని అతడివంక ఎక్కిరిస్తున్నట్లుగా చూస్తూ ఠీవిగా నడిచిపోయింది.

ఏడుపు మొఖంతో రూంకు జేరి నీరసంగా తలుపు తాళం తీసి లైటు వేశాడు. ఆరోజే వచ్చిన ఉత్తరం దొర్లుతోంది.

తీసిచూశాడు. అన్నయ్య దగ్గరినుండి.

తమ్ముడికి,

నీ మౌనాన్నే అర్థాంగీకారంగా తీసుకొని నీకు సంబంధం చూచాం. మీ వదినకి వరసకి బాబాయిగారి కూతురు ఒక అమ్మాయివుంది. అందంగానే వుంటుంది. ఆ అమ్మాయిని చేసుకోవటానికి నీకు ఏ అభ్యంతరం వుండ దనుకుంటాను. అన్నీ నచ్చటంవలన నీవు పిల్లను చూడక ముందే అంతా నిర్ణయం చేశాం.

ఇట్లు
మీ అన్నయ్య సీతాపతి

"ఈ పెద్దవాళ్లు—ఈ ఆడవాళ్లు" అని పళ్లు కరకరా కొరుక్కొని తలపట్టుకొని మంచంమీద కూలబడ్డాడు కాలేజీ గుడ్డలయినా విప్పకుండా మాధవరావు!

* * *

మూడు రోజులు కాలేజీ ఎగగొట్టాడు తల తీసేసి నంతపనయి. రోజూ చేసుకునే గడ్డం జోలికి అసలు పోనే లేదు. ఆకలయినా అన్నం తినడు. తిన్నా సయించదు. సయించినా రాధిక కళ్ళముందు కదిలి వీసమెత్తయినా లోపలికి పోనీయదు.

నాలుగోరోజు పాఠాలన్నీ పోతయ్యేమోనని భయ మేసి ఆ దిగాలుపడిన మొఖంతోనే కాలేజీకి వెళ్ళాడు.

ఈ మూడు రోజుల పట్టి అతడిని ముప్పు తిప్పలు పెట్టిన సమస్య ప్రశ్న—ప్రతి దాంట్లోను తననే దెబ్బ కొడుతున్న రాధికకు తిరుగు దెబ్బ ఎలా కొట్టాలి? దానికి సమాధానం శూన్యం!

బ్యాంకింగ్ లెక్చరర్ పాఠం చెబుతుంటే ఒక వ్యూహం కలిగింది. తట్టటమే ఆలస్యం బయిటకెళ్ళి కాలేజీ ఎదురుగావున్న 'హెయిర్ కట్టింగ్ సెలూను'లో గడ్డం గీయించుకొని, తల దువ్వుకొని మళ్ళా క్లాసులో కూర్చొని హుషారుగా నవ్వుకున్నాడు.

"ఈ దెబ్బతో మాధవరావు మాట అనుకుంటేనే రాధిక గుండెల్లో మెడ్రాస్ మెయిల్ పరుగెత్తాలి!" అనుకుంటుండగానే అనుమానంవచ్చి, "ఎట్లాగబ్బా!" అనుకొని నున్నగావున్న గడ్డాన్ని పీక్కున్నాడు.

క్లాసు వదిలారు. బయటకొచ్చి స్తంభాన్నానుకొని నిలబడ్డాడు మాధవరావు.

ముకుందరావు వచ్చాడు. "ఏరా బ్రదర్! క్షణ క్షణానికి నీ ముఖమే మారుతోందేం?" అంటూ.

"అరేయ్! ఎల్లుండి సాయంత్రం ఐదు గంటలదాకా నన్ను మాట్లాడించబోకురా!" అన్నాడు దూరంగా పోస్టు బాక్సులో ఉత్తరం వేస్తున్న రాధికను చూస్తూ.

చూస్తూనే చిటిక వేసి ఎగిరి గంతేశాడు.

కాలేజీ అయిపోయినా కాంటీన్‌లో కాఫీ త్రాగుతున్నట్లుగా, పోస్టుబాక్సు క్లియరన్స్‌కు పోస్ట్‌మాన్ వచ్చిందాకా కూర్చొని, ఏడుపు మొఖంతో "మిస్టర్! లెటర్ పొరపాటున తప్పు అడ్రసు వ్రాసి పోస్టుచేశాను. తీసుకుంటాను!" అన్నాడు.

అతడు మాధవరావు మొఖానికి జాలిపడి, "ఏరుకోండి" అని మొత్తమిచ్చాడు.

దబదబా రాధిక సంతకంవున్న ఉత్తరం తీసుకొని "థాంక్స్" అంటూ పోస్టుమాన్ పిలుస్తున్నా గూడా వినిపించుకోకుండా వెళ్ళిపోయాడు.

తిరిగి తిరిగి గోడ్ల వెంట తిరిగే చిన్ననాటి మిత్రుడు వెంకట్రావును రాత్రి పన్నెండు గంటలకు పట్టుకొని ఒక ఉత్తరం వ్రాసి పెట్టమని బ్రతిమాలాడు.

వెంకట్రావు ఏదైనా దస్తూరీ చూపిస్తే అచ్చం వాళ్లు వ్రాసినట్లుగానే ఏదైనా వ్రాసి పెట్టగల సమర్థుడు!

ఏమీ లేదు. రెండే మాటలు——

"మై డియర్ మాధవరావ్! రేపు సాయంత్రం ఐదు గంటలకు మా యింటికి టీకి వస్తారుగదూ?

రాధిక"

వ్రాసిన ఉత్తరాన్ని భద్రంగా జేబులో పెట్టుకొని రూంకు పోతూ దారిలో రాధిక వ్రాసిన ఉత్తరం రోడ్డు ప్రక్కనున్న డబ్బాలో వేశాడు.

తను వేసిన ప్లాను, ఊహించిన ఊహాలు రాత్రి కల్లో గిర్రున తిరిగి పరాభవం చెందిన రాధికను చూపెట్టినయి.

సాయంత్రం ఐదవటంతోనే తను లేస్తాడు. బాతు రూంలో కెళ్లి మొఖం కడుక్కొని 'ట్రిమ్ము'గా మేకప్ చేసుకొని జేబులో రాధిక వ్రాసిన ఉత్తరంలాంటి ఉత్తరం పెట్టుకొని వాళ్ళింటికి వెళతాడు.

వాకిట్లో ఆమె తండ్రిగాని, తల్లిగాని ముందుగా ఎదురు పడతారు. తనను చూస్తూనే ఆశ్చర్యపడి "ఎవరు కావాలి...ఎందుకొచ్చారు?" అని అడుగుతారు.

"ఏమీ లేదండి...రాధిక కోసరం...నేను ఆమె క్లాసు మేట్‌ను!" అంటూ భయం భయంగా చెబుతాడు.

"అయితే—?" అంటారు విసుక్కుంటున్నట్లుగా.

మెదలకుండా తన జేబులోని ఉత్తరం తీసి చూపిస్తాడు.

వాళ్ళు కోపాన్ని చేసేదేమీలేక లోపలికి మింగేసి తను అక్కడున్నంత సేపు డొంక తిరుగుడుగాను, తను వచ్చిం

తరువాత సూటిగాను—ఒక పెళ్ళికావాల్సిన పిల్లకు యింటికి వచ్చేటంత బాయ్ ఫ్రెండ్ వున్నందుకుగాను 'చ' కార గుళ్ళు పెడతారు. అప్పుడు చూడాలి రాధిక మొఖం 'అబ్బ!' అనుకున్నాడు.

ఒకవేళ రాధిక ధైర్యంగా నేను అసలు ఆ ఉత్తరం వ్రాయలేదు పొమ్మంటే అది రాధిక వ్రాతకాదు అని నిరూపిస్తే వెంకట్రావు నిల్చున్నపాటున ఆత్మహత్య చేసుకుంటానని వ్రాసిచ్చినంత నమ్మకంగా మాట యిచ్చాడు.

'ఆత్మహత్య' అనుకునేటప్పటికి తెల్లవారు జామున మూడు గంటలకు మెళుకువ వచ్చింది. మళ్ళా చచ్చినా నిద్ర పట్టలేదు.

ఆదివారాన్ని ఖుషీగా అనుభవించి ఐదు గంటలకు అందంగా టాయిలెట్ అయివున్న వాటిల్లోకెల్లా ఖరీదైన సూట్ తీసి తొడుక్కున్నాడు. క్రీమ్‌తో మెత్తబడిన జుట్టును తిరిగినన్ని వంకీలు తిప్పి కదలకుండా అమర్చాడు.

కాఫీ రంగు ప్యాంటు, మల్లెపువ్వులాంటి తెల్ల చొక్కా, వేసుకుని అద్దె టాక్సీలో రాధిక వాళ్ల బంగళా ముందు దిగాడు.

దిగి నలుమూలలా చూచి అదే రాధికవాళ్ల గృహమని దృఢ నిశ్చయానికివచ్చి గేటులోనుండి లోపలికి చూచాడు. గేటుకు వంద గజాల దూరంలోవుంది యిల్లు. మధ్య అందమైన పూదోట యింటికి ఆకర్షణీయంగా వున్నది.

లోపలికి అడుగు వేస్తూ అనుకున్నాడు-తనని భిడియ స్తు డని, అలుసుచేసి ఏడిపించిన రాధికకు కొద్ది క్షణాల్లో ఏడ్చే టంత పరిస్థితి ఏర్పడబోతుందని!

విలాసంగా నవ్వుకున్నాడు. అద్దంలో చూచుకుంటున్న ట్లుగా నొక్కుల నొక్కుల జుట్టును చేతితో సర్దుకున్నాడు.

గేటుదాటి లోపలికి రెండడుగులు వేశాడో లేదో ఒక కుక్క 'భౌభౌ' అని భీకరంగా అరుచుకుంటూ, అతి రయంగా పరుగెత్తుతూ వచ్చింది. మాధవరావు ఆలోచనా ప్రపంచంనుండి అసలు ప్రపంచంలోపడి అప్రతిభుడై రెండ డుగులు వెనక్కువేసి గేటువంక చూచాడు, 'కుక్క వున్నది జాగ్రత్త' అన్న బోర్డును.

ఆ కుక్కవెంటే తోటమాలి గాబోలు పరుగెత్తు కుంటూవచ్చి, దానిని పట్టుకొని "ఫరవా లేదు, వెళ్ళండి బాబు!" అన్నాడు.

మాధవరావు చిరు చెమటను మడత విప్పని జేబురు మాలతో అద్దుకొని వడివడిగా లోపలికి నడిచాడు.

పోర్టికోలో కాలు పెడుతూనే హాలులో సోఫాలో కూర్చొనివున్న కోరమీసాలాయన్ని రాధిక తండ్రి గాబోలు అనుకుంటూ చూచి నిలువెల్లా వణికిపోయాడు. 'గోల్డు ఫ్రేమ్' కళ్ళజోడు వెనుక పత్తికాయలంత గుడ్లు, మొరటుగా నిక్కబొడుచుకున్న జుట్టు, నల్లని నలుపు—లావుగా భీకరంగా వున్నాడు.

తనని చూస్తూనే కాఫీ త్రాగుతున్న ఆయన మీద పడి కరుస్తాడేమోనన్నంత భయమేసింది-ఆయన ప్రక్కనే అచ్చం అన్ని రాధిక పోలికలేవున్న తల్లి నిలబడివుంది.

మాధవరావును చూస్తూనే "ఎవరు? ఏం కావాలి?" అన్నాడు ఆయన చాలా మృదువుగా.

"ఆకారంలోనే గాబోలు భీకరం" అనుకోని తడారిన గొంతుకను తడిచేసుకోని "రాధిక కోసరం" అని నసుగుతూ గొణిగాడు.

ఆయన చిరునవ్వు నవ్వి "పైనవుంది వెళ్ళండి!" అన్నాడు.

ఆమె ఎడమవైపుకు తిరిగి "అటు బాబు మెట్లు" అంది.

మాధవరావు వాళ్ళ మాటలకు నీరు కారిపోయి, తాను ఆశించిన ఫలితం రాకపోవటంతో నిరుత్సాహపడ్డాడు. మరుక్షణంలోనే తేరుకోని చిన్నగా మెట్లెక్కి పైకిపోయాడు.

సంశయిస్తూ హాలులో కాలు పెట్టాడు. రెండు మూడు సోఫాలు హాలులో దూరం దూరంగా అమర్చివున్నాయి. విలువైన తివాసీ నేలనంతా కప్పివేసివుంది. ఒక మూలగా 'స్టాండ్'మీద పూలకుండీ గులాబీలను మరిపించేంత అందంగా మెరుస్తోంది. గోడలమీద నాలుగు వైపులా నాలుగే నాలుగు ఫోటోలు వ్రేలాడుతున్నాయి— చాలా అందంగావుంది ఆ హాలు.

రాధిక ఎక్కడా వున్నట్లు అలికిడి వినబడలేదు—కాని పక్క గదిలోంచి రేడియో సరాగంలీలగా వినిపిస్తోంది. అక్కడే రాధిక తప్పక ఉండి ఉండాలనుకున్నాడు.

అనుకోవటమే తడవుగా చిన్న దగ్గ దగ్గి ఆగది వైపుకు నడిచాడు.

రెండడుగులు వేశాడో లేదో ఆ గది పూర్తిగా కనబడింది. ఆ గదిలో మధ్య ఈజీఛైరులో రాధిక కూర్చొని తనవంకే చిరునవ్వుతో చూస్తోంది!

ఆమె చిరునవ్వుకు తట్టుకోలేకపోయాడు. ఆమె కళ్లు సూదుల్లాగావుండి తన గుండెల్లో పొడుస్తున్నట్లనిపించింది. ఆమె నుదిటిమీద నృత్యంచేస్తున్న ముంగురులు తన వీపు మీద తనకంటే బలమైనవాడు 'తధికిణతోం' చేస్తున్నట్లుగా వున్నది. ఆ అందమైన మొఖంలోనుండి సూర్య కిరణాలు బయల్పడి తనని మాడుస్తున్నాయి.

కళ్ళు రెపరెపలాడించి పెదిమలను దగ్గరకుజేర్చి మరుక్షణంలోనే విస్తృతంచేసి తెల్లని పలువరసను తళుక్కు-మనిపించింది. ఆ కదలికలో చెవులకు పెట్టుకున్న ఖరీదైన రాళ్ళతో నిండిన వెడల్పైన దిద్దుల్లో లైటుకాంతి కలుక్కు-మని మాధవరావు గుండెల్లో జల్లుమంది.

మాధవరావు కొయ్యబొమ్మైపోయి ఆమెను అలాగే కన్నార్పకుండా, శ్వాస పీల్చుకోకుండా చూస్తూ నిలబడ్డాడు. అకస్మాత్తుగా భయమేసింది. అసలు ఎందుకొచ్చానా అని

కలవరపడ్డాడు. కాళ్లు వణికి కళ్ళు తిరగసాగాయి— "అమ్మబాబోయ్! రాధికను ఏడిపించటమే!" అనుకున్నాడు.

"హే భగవాన్! జీవితంలో రాధిక జోలికి నే నెప్పుడూ వెళ్ళను!" అని మనస్సులోనే చెంపలు వాచేటట్లుగా కొట్టుకున్నాడు.

ఏదైతే అదైంది ఇక వెనక్కు వెళ్దామనుకున్నాడు. బలవంతంగా, గాఢంగా, బాధగా ఒక నిట్టూర్పు విడిచి వెనుదిరిగాడు.

"రా బావా! వెళ్ళిపోతావేం!" అంది. ఆ మాటలు వీణమీద గోటితో మీటినట్లున్నయి.

ముకుందంగాడు పక్కన ఉన్నట్లే అనిపించింది. "గాలితీసిందిరా బాబు!" అనుకున్నాడు. "నే నెక్కడ బావనురా నాయనా?" బావ అనేమాట తనమీద ఉపయోగించిన చోదితాస్త్రంలాగా వుంది.

"ఈ రోజు నా కొంప మునిగేటట్లే వుందే!" అనుకున్నాడు. "అతి తెలివికి పోయినందుకు అగాధంలో పడ్డానే!" అనిపించి ఏడ్చాడు.

మాధవరావు మొఖంలో సూదిపెట్టి పొడిచినా నెత్తురు బొట్టు బయటకురాదు. కళ్ళు చూద్దామన్నా కనబడకుండా పీక్కుపోయి లోపలికి పోయినయి. పైన ఫ్యాను తిరుగుతున్నా చొక్కా చమటతో తడిసి ముద్దయింది— అసలు మనిషి ఇంకా కొద్ది క్షణాల్లో ఉరితీయటానికి ఉరి కంబంమీద నిలబెట్టిన మనిషిలా తయారయ్యాడు!

రాధిక తలుపుదాకా వచ్చింది. "అక్కడే నిలబడి పోయావేం—రా బావా...కూర్చుందాం!" అంది.

చేసేదేమీ లేక, ఇంకేమన్నా అంటే గట్టిగా అరుస్తుందేమోనని, తోటకూరకాడల్లా కాళ్ళను యీడ్చుకొని వెళ్ళి సోఫాలో కూలబడ్డాడు.

రెండు నిముషాలు మౌనంగా గడచిపోయినయి.

" ఒక్కక్షణం ... ఏమనుకోబోకు...టీ తెస్తాను! నన్ను అటుపోనిచ్చి బయటకు పరుగెత్తేవు!" నవ్వుతూ ఆ గదినుండి బయటకు వెళ్ళింది.

మాధవరావు లేచి ప్రక్కనేవున్న ఫాన్ 'ఫుల్ స్పీడ్'లో తిప్పి చొక్కాలోకి గాలిని ఎక్కించటానికి తాపత్రయపడసాగాడు.

"మరిదంటే ఏమోననుకున్నా ఘటికుడే! ఏమయ్యా మధు...మాట మాత్రం ఉత్తరం ముక్కయినా వ్రాశావు గాదేం...రాధిక నీకు తెలుసని ... ఇదేనయ్యా మా బాబాయి కూతురు. పిల్లను నీకు చూపించకుండానే నిశ్చయించాం-నీవేమంటావోనని భయపడుతున్నాం!" అంది కొంగు అడ్డం పెట్టుకొని నవ్వాపుకుంటూ అప్పుడే హాలులోకి వచ్చిన వదిన. "మీ అన్నయ్య గూడా వచ్చారు పొద్దున్నే!"

అసలే భారంగావున్న పరిస్థితులకు వదిన గూడా తోడయ్యేటప్పటికి మాధవరావుకు పై ప్రాణాలు పైనే పోయినయి. తరువాత తేరుకొనేటప్పటికి అరగంట పట్టింది.

తేరుకున్న తరువాత మొట్ట మొదటిసారిగా అనుకున్న మాట: "రాధిక ఎంత మంచిది!"

చేసినపని: పై జేబులో కనబడుతూ పెట్టుకున్న రాధిక వ్రాసినలాంటి ఉత్తరం ఎవరూ చూడకుండా వెనుక జేబులోకి మార్చుకున్నాడు.

* * *

ఆరు నెలల తరువాత ఒక రోజు రాత్రి పాతస్మృతులు జ్ఞప్తికి తెచ్చుకుంటూ రాధికకు అతిసమీపంగా జరిగి "నిన్ను ఎన్నోవిధాల ఏడిపించాలని చూచానుగాని నేనే ఓడిపోయాను!" అన్నాడు మాధవరావు.

ఆమె చటుక్కున ఎర్రబడిన బుగ్గలను మాధవరావు బుజంమీద ఆనించి కళ్ళు మూసుకున్నది!

———